# హుజూర్‌నగర్‌లో కారు జోరు

- ఎమ్మెల్యే సైదిరెడ్డి ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం
- ప్రభుత్వ సంక్షేమ పథకాలకు మంచి ఆదరణ



గరిడేపల్లి : సర్వారం గ్రామంలో ఎమ్మెల్యే సైదిరెడ్డి ప్రచారంలో పాల్గొన్న అశేష జనం

హుజూర్‌నగర్, నవంబర్ 17 : హుజూర్‌నగర్ నియోజకవర్గంలో కారు జోరు కొనసాగుతున్నది. ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి మూడు రోజులుగా చేపట్టిన ప్రచారానికి అనూహ్య స్పందన లభిస్తున్నది. సీఎం కేసీఆర్ ఆశీర్వాద సభ తర్వాత పార్టీ క్యాడర్ ఫుల్ జోష్‌లోకి వచ్చింది. పార్టీలో చెత్తంతా తొలగిపోవడంతో జెట్ స్పీడ్‌తో ప్రచారంలో దూసుకు పోతున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల వరకు కాంగ్రెస్ కంచుకోటలా ఉన్న హుజూర్‌నగర్ నియోజకవర్గం 2019 ఉప ఎన్నిక తర్వాత గులాబీ పూదోటలా మారింది. శానంపూడి సైదిరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచిన నాలుగేండ్లలో రెండేండ్లు కరోనాతో గడిచిపోయాయి. మిగిలిన రెండేండ్లలోనే రూ.4వేల కోట్లతో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి గ్రామాల రూపురేఖలు మార్చారు. ఎమ్మెల్యే సైదిరెడ్డి మఠంపల్లి మండలంలోని గుండ్లపల్లికి చెందిన వ్యక్తి కావడంతో నియోజకవర్గ సమస్యలపై పూర్తి అవగాహన ఉంది. దీంతో 20ఏండ్లలో అభివృద్ధి నాలుగేండ్లలో జరిగిందని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

### ఉత్తమ్ వల్లే నియోజకవర్గ అభివృద్ధి కుంటు

తెలంగాణ రాష్ట్రమేర్పడ్డాక 2014లో మలి ఉద్యమకారుడు కాసోజు శ్రీకాంతాచారి తల్లి శంకరమ్మపై ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విజయం సాధించారు. అనంతరం నియోజకవర్గ సమస్యలు పట్టించుకోకుండా కనీసం అంసెబ్లీలో ఈ ప్రాంత అభివృద్ధి గురించి మాట్లాడిన దాఖలు లేవు. ఉత్తమ్ ఎమ్మెల్యేగా ఉన్న ఐదేండ్ల కాలంలో నియోజకవర్గ ప్రజలు గడ్డు పరిస్థితి ఎదుర్కొన్నారు. అభివృద్ధి కుంటుపడింది. ప్రభుత్వం ప్రజలకు అందించే షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి లాంటి సంక్షేమ పథకాల దరఖాస్తులపై సంతకం చేయడానికి ఎమ్మెల్యే అందుబాటులో లేక పెండింగ్‌లో ఉండి ప్రజలు ఇబ్బందులు పడిన సందర్భాలు అనేకం. 2009 నుంచి 2018వరకు మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు 2009నుంచి 2014 చేసిన పనులనే ఇప్పటికి గొప్పగా చెప్పుకోని ఎన్నికల ప్రచారం నిర్వహించడంపై ప్రజలు మండి పడుతున్నారు. ఓటు వేసిన ప్రజలను గౌరవించని ఉత్తమ్‌కు ఓటేయడం దండగని, స్థానికంగా ఉండి ప్రజా సమస్యలపై పోరాడే ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డికే తమ మద్దతు ఇస్తామని నియోజకవర్గ ప్రజలు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.

# రైతుల నోట్లో మట్టి కొట్టేటోళ్లను తరిమి కొట్టాలి

- ఆడబిడ్డల పెండ్లికి రుమాలు ఇవ్వనోళ్లు.. మహిళల సంక్షేమం గురించి మాట్లాడితే ఏలా?
- ఓటమి భయంతోనే మత్తులో ఉంటూ.. సీఎం అభ్యర్థినంటూ ప్రచారం
- ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి
- నల్లగొండ మండలంలో ప్రచారం



నల్లగొండ రూరల్: అన్నెపర్తి రోడ్డు షోలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పక్కన బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చకిలం అనిల్ కుమార్, చెరుకు సుధాకర్

నల్లగొండ రూరల్, నవంబర్ 17 : ఎకరం ఉంటే గంట కరెంట్, మూడు ఎకరాలు ఉంటే మూడు గంటల కరెంట్ ఇస్తామని రైతుల నోట్లో మట్టి కొట్టేలా మాటలు చెబుతున్నా కాంగ్రెసోళ్లను ఈ ఎన్నికల్లో తరిమి కొట్టాలని బీఆర్‌ఎస్ నల్లగొండ అభ్యర్థి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. నల్లగొండ మండలం అన్నెపర్తి ,బుద్ధారం, అప్పాజీపేట, రాములబండ,రంగారెడ్డినగర్, దోమలపల్లి, నర్సింగ్‌భట్ల, పాతూరు గ్రామాల్లో శుక్రవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడబిడ్డ పెళ్లికి చేతి రుమాలు ఇవ్వనోళ్లు ఇయ్యాల మహిళల సంక్షేమ గురించి మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందన్నారు. ఓటమి భయంతోనే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎప్పుడూ మత్తులో తూళుతున్నాడని, అందుకే సీఎం అభ్యర్థి తానే అంటూ ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. ఈ ఎన్నికల్లో కూడా ఇక్కడి నుంచి తరిమికొడితే మళ్లీ రాడన్నారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి తనను రెండోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు చకిలం అనిల్ కుమార్, చెరుకు సుధాకర్ మాట్లాడుతూ నల్లగొండలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు పూర్తి కావాలంటే కంచర్ల భూపాల్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చీర పంకజ్ యాదవ్, పీఏసీఎస్ చైర్మన్ నాగరత్నం రాజు, వైస్ చైర్మన్ తవిట కృష్ణ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు దేప వెంకట్‌రెడ్డి, బకరం వెంకన్న, మహిళ విభాగం అధ్యక్షురాలు కొప్పోల విమలమ్మ, కాసర్ల విజయ రెడ్డి, సర్పంచులు మేకల అరవింద్‌రెడ్డి, పబ్బతి రెడ్డి రవీందర్ రెడ్డి, బకరం యాదమ్మ, రూపాని జయమ్మాపెద్దులు, మామిళ్ల సైదులు , ఉపేంద్రచారి, చామకూరి తేజస్వీని, కారింగ్ సైదులు, బడుపుల శంకర్, పొగాకు ఘట్టయ్య, బుచ్చిరెడ్డి , మాజీ జడ్పీటీసీ తుమ్మల రాధాలింగస్వామి, మాజీ ఎంపీపీ నారబోయిన భిక్షం, డాక్టర్ సుహాస్, గోపాల్ రెడ్డి , పనస శ్రీను పాల్గొన్నారు.



నల్లగొండ మండలం బుద్దారంలో రోడ్ షోకు హాజరైన ప్రజలు, బీఆర్‌ఎస్ శ్రేణులు

### గడప గడపకూ సంక్షేమ పథకాలను తీసుకెళ్లాలి

నల్లగొండ రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను కార్యకర్తలు గడప గడపకూ తీసుకెళ్లి వివరించాలని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి సూచించారు. మండలంలోని పెద్దసూరారంలో తిప్పర్తి మాజీ వైస్ ఎపీపీ పెండెం అరుణ నివాసంలో నిర్వహించిన శుక్రవారం పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు గుండె కృష్ణయ్య, ఎర్రమాద రాంరెడ్డి, వి.కరుణాకర్‌రెడ్డి, ఎం.రాంబాబు,పెంటయ్య, శంకరయ్య, సుందర్, తంతెనపల్లి కృష్ణయ్య, యూత్ అధ్యక్షుడు మోహన్ పాల్గొన్నారు.

# 20న నల్లగొండ జిల్లాకు సీఎం కేసీఆర్

- నకిరేకల్, నల్లగొండల్లో బహిరంగ సభలు
- ఎమ్మెల్యేలు చిరుమర్తి, కంచర్ల ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- పెద్ద ఎత్తున తరలివచ్చేందుకు సిద్ధమవుతున్న జనం

నల్లగొండ ప్రతినిధి, నవంబర్ 17 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ మరోసారి నల్లగొండ జిల్లాలో పర్యటించనున్నారు. ఈ నెల 20న నకిరేకల్, నల్లగొండ నియోజకవర్గాల్లో జరిగే ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొననున్నారు. బీఆర్‌ఎస్ అభ్యర్థులు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నారు. సీఎం కేసీఆర్ సభల కోసం ఇప్పటికే ఏర్పాట్లు చురుకుగా సాగుతున్నాయి. సభాస్థలం చదునుతో పాటు ఇతర పనులు పూర్తి కావచ్చాయి. మరో వైపు సభకు పార్టీ నేతలు, శ్రేణులు విస్తృతంగా ప్రచారం కల్పిస్తున్నారు. దీంతో పెద్ద సంఖ్యలో ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు సన్నద్ధమవుతున్నట్లు సంకేతాలు ఉన్నాయి. సభకు వచ్చే వారికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లపై దృష్టి సారించారు.

ఇప్పటికే ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 9 అసెంబ్లీ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. ఆయా చోట్ల బీఆర్‌ఎస్ అభ్యర్థులకు మద్దతుగా ప్రసంగిస్తూ మరోసారి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. భువవనరి, మునుగోడు, కోదాడ, తుంగతుర్తి, ఆలేరు, హుజూర్‌నగర్, మిర్యాలగూడ, దేవరకొండల్లో తొలి విడుతలోనే సీఎం కేసీఆర్ పర్యటించారు. మలి విడుతలో ఈ నెల14న నాగార్జునసాగర్ నియోజకవర్గం హాలియాలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో కేసీఆర్ పాల్గొన్నారు. ఇవి కాకుండా నకిరేకల్, నల్లగొండ, సూర్యాపేట నియోజకవర్గాల్లో కేసీఆర్ పర్యటించాల్సి ఉంది. ఈ నేపథ్యంలోనే ఈ నెల20న మధ్యాహ్నం నకిరేకల్, సాయంత్రం నల్లగొండలో జరుగనున్న ప్రజాఆశీర్వాద సభల్లో పాల్గొనేలా కేసీఆర్ పర్యటన ఖరారైంది. కేసీఆర్ రాక కోసం అటు నకిరేకల్, ఇటు నల్లగొండలో స్థానిక ఎమ్మెల్యే అభ్యర్థులు చిరుమర్తి లింగయ్య, కంచర్ల భూపాల్‌రెడ్డిలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే సభాస్థలాలను ఎంపిక చేసి చదును కూడా చేశారు. ఇతర ఏర్పాట్లపై దృష్టి సారించారు. నకిరేకల్‌లో మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే సభ కోసం పట్టణంలోని మూసీ రోడ్డులో విశాలమైన స్థలాన్ని ఎంపిక చేశారు. ఇందులో ఏర్పాట్లను మొదలు పెట్టారు. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఆధ్వర్యంలోని సభా ఏర్పాట్లను ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ అధ్యక్షుడు దూదిమెట్ల బాలరాజుయాదవ్, రాష్ట్ర నేత చెరుకు సుధాకర్, నలగాని ప్రసన్నరాజ్ సభ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు సభా ఏర్పాట్లను పరిశీలించి చర్యలు చేపట్టారు. ఇక నల్లగొండలో నిర్వహించే సభ కోసం మర్రిగూడ బైపాస్ రోడ్డులోని విశాలమైె స్థలాన్ని ఎంపిక చేశారు. 2018 ఎన్నికల సమయంలోనూ ఇదే స్థలంలో కేసీఆర్ సభలు నిర్వహించారు. అదే స్థలం అందరికీ అనువుగా ఉంటుందని మరోసారి అందులోనే సభకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఏర్పాట్లను జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, రాష్ట్ర నేతలు చాడ కిషన్‌రెడ్డి, చకిలం అనిల్‌కుమార్, కంచర్ల కృష్ణారెడ్డి పర్యవేక్షిస్తున్నారు. ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు కూడా ఏర్పాట్లు పరిశీలించారు. ఏర్పాట్లలో ఎక్కడా ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. సభకు వచ్చే వాహనాలకు అవసరమైన పార్కింగ్ స్థలాలను సిద్ధం చేస్తున్నారు. సభా వేదికతో పాటు వీఐపీ, మహిళా, మీడియా... ఇలా ప్రత్యేకంగా భారీకేడ్లో గ్యాలరీలను ఏర్పాటు చేస్తున్నారు.

### సభకు విస్తృత ప్రచారం

ఇక సీఎం కేసీఆర్ హాజరవుతుండడంతో 2 నియోజకవర్గాల్లోనూ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. కేసీఆర్ సారథ్యంలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ ప్రజలను సభలకు ఆహ్వానిస్తున్నారు. ఆయా పథకాల లబ్ధిదారులంతా స్వచ్ఛందంగా తరలివచ్చి కేసీఆర్ కృతజ్ఞతలు తెలిపేందుకు సిద్ధమవుతున్నారు. ప్రతి ఆవాసం నుంచి ప్రజలు తరలివచ్చేలా నేతలు చర్యలు తీసుకుంటున్నారు. కేసీఆర్ కూడా ఈ సభా వేదికలపై నుంచి ప్రజలకు దిశానిర్దేశం చేయనున్నారు. సాధించుకున్న రాష్ట్రంలో ఇప్పటివరకు చేసిందేమీటి? ఇంకా చేయాల్సింది ఏమిటీ? కాంగ్రెస్, బీజేపీలు చేస్తున్న కుట్రలు ఏంటీ? ఈ పరిస్థితుల్లో ప్రజల ముందున్న కర్తవ్యం ఏమిటీ? ఇలా అనేక విషయాలపై కేసీఆర్ ప్రజలకు వివరించనున్నారు. నకిరేకల్, నల్లగొండ నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధితో పాటు ఇంకా మిగిలి ఉన్న పనులపై కేసీఆర్ ప్రజలకు స్పష్టమైన సందేశం ఇవ్వనున్నారు. పార్టీ నేతలు ఆశీర్వాద సభలకు విస్తృత ప్రచారం నిర్వహించి, జనం తరలివచ్చేలా పనుల్లో నిమగ్నమయ్యారు.

# ఎంఐఎం మద్దతు బీఆర్‌ఎస్‌కే..

- నల్లగొండలో ఎమ్మెల్యే కంచర్ల గెలుపునకు ఎంఐఎం కార్యకర్తలు కృషి చేయాలి
- సీఎం కేసీఆర్‌తోనే మైనార్టీలకు రక్షణ, సంక్షేమం
- ఎంఐఎం అధ్యక్షుడు రజియొద్దీన్

నల్లగొండ, నవంబర్ 17: త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ నుంచి బరిలో ఉన్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డికే ఎంఐఎం మద్దతు ఇస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు రజియొద్దీన్ తెలిపారు. నల్లగొండలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకుడు చకిలం అనిల్ కుమార్‌తో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంఐఎం జాతీయ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ ఆదేశాల ప్రకారం నల్లగొండలో బీఆర్‌ఎస్ అభ్యర్థికి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని అన్నారు.

### బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇవ్వడం శుభపరిణామం

నల్లగొండలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల భూపాల్ రెడ్డి గెలుపు కోసం ఎంఐఎంమద్దతు ఇవ్వడం శుభ పరిణామం అని జడ్పీ చైర్మన్ బండ నరేందర్ రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ వలి, నాయకులు చకిలం అనిల్ కుమార్ అన్నారు. బీఆర్‌ఎస్‌తోనే మైనార్టీల సంక్షేమం ఉంటుందని అన్నారు. 2014 నుంచి కూడా కేసీఆర్‌కే మద్దతు ఇచ్చిన ఎంఐఎం మరోసారి ఇవ్వడం సంతోష కరమన్నారు. ఈ సమావేశంలో ఎంఐఎం పట్టణ అద్యక్షుడు నజీబ్, మార్కెట్ కమిటీ చైర్మన్ చీర పంకజ్ యాదవ్, కనగల్ ఎంపీపీ కరీంపాషా, కటికం సత్తయ్య గౌడ్, జమాల్ ఖాద్రి తదితరులు పాల్గొన్నారు.